పీహెచ్‌సీలో డీఎంహెచ్‌వో తనిఖీ

వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

వాజేడు, మార్చి 12 : మండలకేంద్రంలోని పీహెచ్‌సీని బుధవారం డీఎంహెచ్‌వో గోపాల్‌రావు సందర్శించారు. వైద్యాధికారులు, సిబ్బంది హాజరు రిజిస్టర్ పరిశీలించి సిబ్బంది అందించే సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రసవాల సంఖ్య పెరిగేలా చూడాలని, క్షయవ్యాధిగ్రస్తులను గుర్తించి, నెలసరి మందులను సకాలంలో అందజేయాలని సూచించారు. ప్రజలు వడదెబ్బకు గురికాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యసిబ్బందికి సూచించారు. వలసకూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందజేయాలని, వారి ఆరోగ్య సమస్యలను తెలుసుకొని చికిత్స అందించాలన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో కోరం క్రాంతికుమార్, వైద్యాధికారులు మధుకర్, రహీల్, తరణ్, యోషిత, హెల్త్‌సూపర్‌వైజర్లు కోటిరెడ్డి, వెంకటరమణ, స్టాఫ్‌నర్సులు అనూష, భాగ్యలక్ష్మి, మానస, శిరీష, సిబ్బంది పాల్గొన్నారు.

వలసకూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్ల అందజేత

మండలంలోని పేరూరు పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో మిర్చికోతలకు వచ్చిన ఛత్తీస్‌గఢ్ వలసకూలీలకు వైద్య సిబ్బంది బుధవారం ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందజేశారు. వేసవిలో ఎండల నుంచి రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి రహీల్, హెచ్‌ఈవో వేణుగోపాలకృష్ణ పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు సన్మానం

సన్మాన గ్రహీతలతో కేంద్ర పురావస్తు శాఖ అధికారులు

వెంకటాపూర్, మార్చి 12 : అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా మండలంలోని పాలంపేట గ్రామం రామప్ప దేవాలయం ఆవరణలో కేంద్ర పురావస్తు శాఖ ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులను బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా కేంద్ర పురావస్తు శాఖ సీఏలు మల్లేశ్, నవీన్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. మహిళలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ కుమార్, పాలంపేట, లక్ష్మీదేవిపేట స్కూళ్ల ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతతోనే పురోగతి

ములుగురూరల్, మార్చి 12 : మహిళా సాధికారత ద్వారానే దేశ పురోగతి సాధ్యమని ములుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మల్లేశం అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఉమెన్ ఎంప్లాయ్‌మెంట్ కన్వీనర్ తేజోలత, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బాఇలయ్య, అధ్యాపకులు బాలయ్య, కవిత, నాగమణి, శిరీష, జగదీశ్, అనిల్‌కుమార్, విజేత, శంకర ఉయశ్రీ, తేజోలత, శ్రీను, మౌలానా, రమేశ్, అనిల్, రమేశ్, లక్ష్మి, షరీఫా పాల్గొన్నారు.

భూసేకరణ కోసం గ్రామసభలు

కాటారం, మార్చి 12 : చిన్నకాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మండలంలోని చిదినెపల్లి, బొప్పారం, చింతకాని, ప్రతాపగిరి గ్రామాలకు నూతన రిజర్వాయర్ కింద ప్రధాన కాలువ, డిస్ట్రిబ్యూటరీల నిర్మాణం కోసం 32.38ఎకరాల భూసేకరణపై బుధవారం ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు. తహసీల్దార్ నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన సభలో ప్రాథమిక నోటిఫికేషన్ మేరకు ప్రతిపాదిత భూసేకరణ రైతుల వివరాలు చదివి వినిపించారు. రైతుల నుంచి అభ్యంతరాలను స్వీకరించారు. కోమటికుంట చెరువును ప్రాజెక్టుకు అనుసంధానించాలని రైతులు కోరారు. భూమికి బదులు మరోచోట భూమి ఇవ్వడంతోపాటు ఉపాధి కల్పించాలని అభ్యర్థించారు. పరిశీలించిన అనంతరం చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు. ఎంపీవో వీరస్వామి, ప్రత్యేక డీటీ శివ, షఫీ, ఏఈఈ వెంకన్న, ఆర్ఐ వెంకన్న, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జిల్లా స్థాయి యువజనోత్సవాలు

భూపాలపల్లి రూరల్, మార్చి 12 : భూపాలపల్లి పట్టణంలోని సంఘమిత్ర డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో నేడు (మార్చి13) వరంగల్ నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువజన ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నెహ్రూ యువ కేంద్ర డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్, సంఘమిత్ర కళాశాల ప్రిన్సిపాల్ ఎలుగూరి హరికృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భూపాలపల్లి జిల్లాలోని యువతీయువకులకు యంగ్ రైటర్స్, యంగ్ ఆర్టిస్ట్, ఫొటోగ్రఫీ, ఉపన్యాసం, సంస్కృతిక జానపద నృత్యం(గ్రూప్), సైన్స్ ఎగ్జిబిషన్ (గ్రూప్,వ్యక్తిగత) వంటి రకరకాల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొని అత్యంత ప్రతిభ కనబరిచిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ నగదు బహుమతితోపాటు ప్రశంసపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు పోటీల్లో పాల్గొనవచ్చని, వివరాలకు 9640881670, 7659071405 సంప్రదించవచ్చని వారు తెలిపారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

- ములుగు కలెక్టర్ టీఎస్ దివాకర
- వాజేడు మండలంలో అధికారులతో సమీక్ష
- ప్రజల నుంచి వినతుల స్వీకరణ

మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ దివాకర

వాజేడు, మార్చి 12 : ప్రజల సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని ములుగు కలెక్టర్ టీఎస్ దివాకర అన్నారు. మండలకేంద్రంలోని ఐటీఐ కళాశాల సమీపంలోని రైతువేదికలో బుధవారం మండల సమస్యలపై అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వాటిని తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కాగా, ప్రగళ్లపల్లి, బొమ్మనపల్లి గ్రామాల మధ్యలో మట్టిరోడ్డుతోపాటు చెరుకురు, పేరూరు, చింతూరు, ధర్మవరం, కడెకల్ గ్రామాల మధ్య రహదారి నిర్మాణ పనులు, గుమ్మడిదొడ్డి రక్షిత మంచినీటి ట్యాంక్ వద్ద బోరు వేయించాలని కోరుతూ స్థానిక నాయకుడు కాకర్లపూడి విక్రాంత్ వినతిపత్రం అందజేశారు. అలాగే, సింజెంటా, తదితర కంపెనీల నకిలీ విత్తనాలతో నష్టపోయిన మక్కజొన్న పంటలకు పరిహారం అందేలా చూడాలని పురుగుమందులను మిర్చిపంటకు పిచికారీ చేయించి, రైతుల నుంచి అధిక ధర వసూలు చేసి, మిర్చి క్వింటాకు రూ.10,500 మాత్రమే ఇస్తానని మోసం చేస్తున్న డీలర్‌పై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ నవనిర్మాణసేన నాయకుడు కొర్స నరసింహమూర్తి కోరారు. దీంతో పంట నష్టపోయిన రైతులు గురువారం సాయంత్రంలోగా వ్యవసాయశాఖ కార్యాలయానికి వెళ్లి వివరాలు నమోదు చేసుకోవాలని, అందరికీ న్యాయం జరిగేలా చూస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. అలాగే, బాధిత రైతులు ఫిర్యాదు చేస్తే డీలర్లపై చీటింగ్, క్రిమినల్ కేసులు నమోదు చేసేలా ఎస్పీతో మాట్లాడతానని తెలిపారు. కాగా, మక్కజొన్న కంకులు తిన్న పలువురు కూలీలు అస్వస్థతకు గురైనట్లు చెప్పడంతో స్పందించిన కలెక్టర్ ఆయా గ్రామాల్లో వారిని గుర్తించి వైద్యపరీక్షలు నిర్వహించి, నివేదిక అందజేయాలని డీఎంహెచ్‌వో గోపాలరావుకు సూచించారు. వేసవిలో విద్యుత్, తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం టేకులగూడెం మోడల్ గ్రామాన్ని కలెక్టర్ సందర్శించి, పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, మండల ప్రత్యేక అధికారి సర్దార్‌సింగ్, తహసీల్దార్ శ్రీరాముల శ్రీనివాస్, ఎంపీడీవో విజయ, ఎంఈవో వెంకటేశ్వరరావు, ఏవో ముంజ మహేశ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శైలజ, విద్యుత్ ఏడీ ఆకిటి స్వామి, ఏఈ అర్షద్ అహ్మద్ పాల్గొన్నారు. కాగా, మండపాక ప్రభుత్వ భూమిలో నివసిస్తున్న గుడిసెవాసులకు తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరుతూ ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు జెజ్జరి దమోదర్‌రావు ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్, శాంతకుమారి, కృష్ణబాబు పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు పాటించాలి

ములుగురూరల్ : వేసవిలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ టీఎస్ దివాకర అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో అధికారులతో ఆయన సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ప్రజలకు వడదెబ్బపై అధికారులు అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. ఉష్ణోగ్రత అధికంగా నమోదయ్యే అవకాశం ఉన్నందున ప్రజలకు అధికారులు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో గోపాల్‌రావు, డీపీవో దేవరాజు, డీఈవో పాణిని, అధికారులు పాల్గొన్నారు.

కేటీఆర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దళిత బంధు సాధన సమితి నాయకులు

కాంగ్రెస్‌ను నిలదీయాలని కేటీఆర్‌కు వినతి

ములుగురూరల్, మార్చి 12 : దళిత బంధు నిధులు విడుదలలో జాప్యం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసి న్యాయం చేయాలని రాష్ట్ర మాజీ మంత్రి కేటీఆర్‌కు దళిత బంధు రాష్ట్ర సమితి అధ్యక్షుడు కోగిల మహేశ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం దళితుల జీవితాలతో చలగాలం ఆడుతుందని ఆయన ఆరోపించారు. నిధులు విడుదల చేయడంలో చొరవ చూపాలని కేటీఆర్‌ను కోరారు. కేసీఆర్‌ను కలిసిన వారిలో నాయకులు కందుల లక్ష్మయ్య, బడుపుల శంకర్, బచ్చలకూరి ఓదేలు, తొగరు అశోక్, జానపట్ల సంపత్, జన్ను సుమన్, మహేశ్, విద్యాసాగర్, బత్తుల విజయ్, జక్కయ్య పాల్గొన్నారు.

ఎంపీ డీకే అరుణ క్షమాపణ చెప్పాలి

ఏటూరునాగారం, మార్చి 12 : షెడ్యూల్డ్ తెగలపై ఎలాంటి అవగాహన లేకుండా మంత్రి డీకే అరుణ మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని ఆదివాసీ మహిళా సంఘం రాష్ట్ర నాయకులు, జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీకాంత అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సంఘం సమావేశంలో వారు మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రంలో ఓసీ, బీసీ కులాలు, తెలంగాణ రాష్ట్రంలో 20బోయ, వాల్మీకీ కులాలను షెడ్యూల్డ్ తెగలో కలపాలని పార్లమెంటులో మాట్లాడడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. డీకే అరుణ వెంటనే క్షమాపణ చెప్పాలని, మాటలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే ఏజెన్సీలోని బీజేపీ నాయకుల ఇండ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో వట్టం సుధ, సనప లలిత, పద్మ పాల్గొన్నారు.

వాలీబాల్ క్రీడలు ప్రారంభం

వాజేడు, మార్చి 12 : మండలంలోని ఘణపురం గ్రామంలో సమ్మక్క, సారలమ్మ జాతర సందర్భంగా నాలుగు మండలాల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభించారు. ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు జెజ్జరి దామోదర్‌రావు రిబ్బన్ కట్ చేసి పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు కుర్సం ప్రవీణ్, శాంతకుమారి, కృష్ణబాబు, కమిటీ సభ్యులు బొగ్గం బాబు, ఎట్టి పవన్, అర్జున్, శివ, పీడీ బొత్స నరసింహమూర్తి పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ జాయింట్ యాక్షన్ కమిటీ నియామకం

కాటారం, మార్చి 12 : ఎస్సీ వర్గీకరణ జాయింట్ యాక్షన్ కమిటీ మండని నియోజకవర్గ కన్వీనర్‌గా మండల కేంద్రానికి చెందిన బొడ్డు సదానందం నియమితులయ్యారు. ఎస్సీ వర్గీకరణ జాయింట్ యాక్షన్ కమిటీ జాతీయ చైర్మన్ డాక్టర్ మామిడి సుదర్శన్, రాష్ట్ర చైర్మన్ పులిగిల్ల బాలయ్యల ఆదేశాల మేరకు నియామకపు ఉత్తర్వులను జారీ చేసినట్లు బుధవారం రాష్ట్ర వైస్‌చైర్మన్ కొర్నెల్ తెలిపారు. తన నియామకానికి సహకరించిన ఎస్సీ వర్గీకరణ జాయింట్ యాక్షన్ కమిటీ జాతీయ, రాష్ట్ర నేతలకు బొడ్డు సదానందం కృతజ్ఞతలు తెలిపారు.

బస్టాండ్‌ను నిర్మించాలి

గోవిందరావుపేట, మార్చి12 : ప్రయాణికుల సౌకర్యార్థం పస్రా గ్రామంలో బస్టాండ్‌ను నిర్మించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో పస్రాలో నిరసన తెలిపారు. 50 గ్రామాలకు ముఖ్య కూడలిగా ఉన్న పస్రాలో బస్టాండ్ లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మంత్రి సీతక్క చొరవ తీసుకొని బస్టాండ్‌ను నిర్మించాలని కోరారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు చట్టిబాబు, నాయకులు నాగిరెడ్డి, నాగరాజు, మల్లారెడ్డి, మురళి, సూర్యనారాయణ, అరుణ్, జీవన్, రాజేశ్వరి, రమేశ్, సువర్ణ, కవిత, రమేశ్, స్రవంతి పాల్గొన్నారు.

గిరిజనులకు డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ

ఏటూరునాగారం, మార్చి 12 : గిరిజన నిరుద్యోగ అభ్యర్థులకు ములుగు రోడ్డులోని జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ సెంటర్‌లో 21 రోజుల పాటు లైట్ మోటార్ మెకానిక్, 30 రోజుల పాటు హెవీ మోటార్ మెకానిక్ డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణా కాలంలో ఉచితంగా భోజన వసతి సౌకర్యం ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు సంబంధిత జిరాక్స్ పత్రాలు, సర్టిఫికెట్లతో ఈ నెల 22 సాయంత్రం 5గంటల వరకు ఐటీడీఏ కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలని సూచించారు. వివరాలకు 94903 41911 సంప్రదించాలని కోరారు.

వేసవిలో అప్రమత్తంగా ఉండాలి

ఏటూరునాగారం, మార్చి 12 : వేసవిలో ఎండల పట్ల అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ ప్రణీత్ కుమార్ సూచించారు. ఎండ తీవ్రత పెరుగుతున్నందున మండలంలోని కొండాయి సమీపంలోని గొత్తికోయ గ్రామంలో వడదెబ్బ తగలకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను బుధవారం వివరించారు. ఇంటింటా సందర్శించి గర్భిణులు, బాలింతలకు పరీక్షలు నిర్వహించారు. మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు. ఎండలు బాగా ఉన్నప్పుడు ఉదయం, సాయంత్రం మాత్రమే పనులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు సమ్మక్క, లక్ష్మి, జ్యోతి పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరం

వెంకటాపురం(నూగూరు), మార్చి12 : మండలంలోని అలుబాక, నూగూరు గ్రామాల్లో బుధవారం ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 24 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. అనంతరం రక్త నమూనాలను సేకరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి స్నేహారెడ్డి, సత్యనారాయణ, సిబ్బంది యాకలక్ష్మి, రామకృష్ణ పాల్గొన్నారు.

వివిధ వేషధారణలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఆకట్టుకున్న హర్యాన కల్చరల్ ఈవెంట్

ఏటూరునాగారం, మార్చి 12 : ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్‌లో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం హర్యాన కల్చరల్ ఈవెంట్ నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులంతా హర్యాన సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా దుస్తులు ధరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. రెండు రోజులుగా పాఠశాలలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. మొదటి రోజు హర్యాన వంటకాలు తయారు చేశారు. కార్యక్రమంలో ఈవెంట్ ఇన్‌చార్జి సూర్యం, హెచ్‌ఎం సాంబశివరావు పాల్గొన్నారు.

బీసీలకు బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్‌లో శిక్షణ

భూపాలపల్లి రూరల్, మార్చి 12 : హైదరాబాద్ స్కూల్ ఆఫ్ బ్యాంకింగ్, ఫైనాన్స్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో జిల్లాలోని బీసీ అభ్యర్థులకు బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ రంగంలో ఒక నెలపాటు నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి టీ శైలజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ ఉత్తీర్ణులై 26యేళ్ల కంటే తక్కువ వయసు ఉన్న అభ్యర్థులు ఏప్రిల్ 8వ తేదీ వరకు "www.tgbcstudycircle.cgg.gov.in" ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్ స్క్రీనింగ్ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా 30మంది అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. వివరాలకు 040-29303130ను సంప్రదించాలని ఆమె సూచించారు.

డిజిటల్ పేమెంట్స్‌పై అవగాహన

గణపురం, మార్చి 12 : చెల్పూర్‌లోని జడ్పీఎస్ఎస్ విద్యార్థులకు తెలంగాణ గ్రామీణ బ్యాంకు చెల్పూర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో డిజిటల్ పేమెంట్స్‌పై బుధవారం అవగాహన కల్పించారు. ఆర్బీఐ నుంచి వచ్చిన అధికారి వెంకటరమణ ఫోన్‌పే, గూగుల్‌పే, భీమ్ ఆఫ్, పేటీమ్ తదితర డిజిటల్ ఆర్థిక సేవల గురించి వివరించారు. తెలియని వ్యక్తులకు ఫోన్‌లో బ్యాంకు ఖాతాల సమాచారం చెప్పవద్దన్నారు. ఎవరైనా సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆన్‌లైన్ గేమ్స్, లోన్స్‌తో జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీఐ అధికారి భరత్ కుమార్, టీజీబీ వరంగల్ రీజినల్ ఆఫీస్ నోడల్ అధికారి శ్రీనివాస్, ఎఫ్ఎల్‌సీ కౌన్సిలర్ ప్రేమ్ కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ మల్లేశ్, బ్యాంకు మిత్ర పూర్ణచందర్, పాఠశాల ఇన్‌చార్జి జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు అండగా భరోసా కేంద్రం

ములుగురూరల్, మార్చి12 : ములుగు జిల్లా కేంద్రంలోని భరోసా కేంద్రం బాధితులకు అండగా ఉంటుందని మహిళా ఎస్సై స్రవంతి అన్నారు. బుధవారం ముగ్గురు బాధిత మహిళలకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారాన్ని అందించారు. స్రవంతి మాట్లాడుతూ లైంగిక హింసలు వంటి వేధింపులకు గురైన వారికి సాయం అందించేడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. మహిళలు భరోసా కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆపద సమయంలో డయల్ 100ను సంప్రదించాలని కోరారు.

సుంకం చెల్లించని మద్యం పట్టివేత

ఐదుగురిపై కేసు నమోదు

మహాముత్తారం, మార్చి 12 : సుంకం చెల్లించని మద్యం అక్రమంగా విక్రయిస్తుండగా దాడులు చేసి, ఇద్దరిని అదుపులో తీసుకుని ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై కిష్టయ్య తెలిపారు. బుధవారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ లింగాచారి ఆధ్వర్యంలో మండలంలోని కనుకునూరు, సింగంపల్లి, మహాముత్తారం, నర్సింగాపూర్ గ్రామాల్లో దాడులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అక్రమంగా విక్రయిస్తున్న 9.375 లీటర్ల నాన్‌డ్యూటీ పెయిడ్ మద్యం, 21.96 లీటర్ల అక్రమ మద్యం, 22.1 లీటర్ల బీర్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కాటారం డివిజన్‌లో ఎక్కడైనా అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి

మహాముత్తారం, మార్చి 12 : నిషేధిత గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై మహేందర్ కుమార్ తెలిపారు. బీహార్ రాష్ట్రానికి చెందిన గణేశ్ ఠాకూర్(49) మూడేళ్లుగా గణపురం మండలం చెల్పూరులో రైస్ మిల్‌లో గుమస్తాగా పనిచేస్తున్నాడు. జీతం డబ్బులు సరిపోక అధిక మొత్తంలో డబ్బు సంపాదించాలనే ఆశతో విశాఖపట్నం మారుమూల ప్రాంతాల నుంచి తక్కువ రేటుకు గంజాయి కొనుగోలు చేసి, మహాముత్తారం మండల పరిసర గ్రామాల్లో విక్రయిస్తున్నాడు. ఈ మేరకు పక్కా సమాచారం అందుకున్న ఎస్సై మహేందర్ కుమార్ సిబ్బందితో కలిసి యామన్ పల్లి శివారు చెరువు వద్ద అతడిని పట్టుకొని 12.765 కిలోల గంజాయిని సీజ్ చేశారు. కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. కాగా, అతడిపై గతంలో గణపురం పోలీస్‌స్టేషన్‌లో గంజాయి విక్రయిస్తూ పట్టుబడి, జైలుకు వెళ్లాడు. బెయిల్‌పై ఇటీవలే బయటికి వచ్చి మళ్లీ గంజాయి విక్రయిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. సమావేశంలో కాటారం డీఎస్పీ జీ రామ్మోహన్‌రెడ్డి, సీఐ నాగార్జునరావు, సీసీఎస్ ఎస్సై భాస్కరరావు పాల్గొన్నారు.

అడవుల సంరక్షణపై ప్రజలకు అవగాహన

చింతకానిలో అవగాహన కల్పిస్తున్న అటవీఅధికారులు

కాటారం, మార్చి 12 : మండలంలోని చింతకానిలో గ్రామంలో అటవీశాఖ అధికారులు ప్రజలకు వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ప్లెక్సీలు, పోస్టర్లతో అధికారులు గ్రామస్తులకు పెద్దపులి సంచారంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వేసవిలో ఎరగడి మంటలు, అడవుల సంరక్షణ ప్రయోజనాలపై కాటారం, యామన్‌పల్లి డిప్యూటీ రేంజర్లు సురేందర్, శ్రీనివాస్ అవగాహన కల్పించారు. జాదరావుపేట అడవీ ప్రాంతంలో మంగళవారం ఓ ఆవుదూడపై పులి దాడి చేయడంతో అటవీశాఖ అధికారులు పులి ఆచూకీ కోసం ట్రాక్ కెమెరాలు ఏర్పాటు చేశారు. పులి కోసం ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలిస్తున్నారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో చంద్రశేఖర్, ఎఫ్‌బీవోలు అశోక్, సంజీవ్, రాజ్‌కుమార్, మొయినోద్దిన్, మోనా కౌసర్, జయలక్ష్మి, రాజేందర్, బేస్ క్యాంప్ సిబ్బంది ఉన్నారు.

ఇంటర్న్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

భూపాలపల్లి రూరల్, మార్చి 12 : మినిస్ట్రీ ఆఫ్ కార్పొరేట్ అఫైర్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఇంటర్న్‌షిప్ కోసం ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా పరిశ్రమలశాఖ జనరల్ మేనేజర్ సిద్ధార్థ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశ వ్యాప్తంగా 745జిల్లాలు, 25సెక్టార్లలో 1.25లక్షల కంటే ఎక్కువ ఇంటర్న్ షిప్‌కు అవకాశం కల్పించబడుతుందని, జిల్లాలో అర్హులైన అభ్యర్థులు ఈ నెల 31వ తేదీ వరకు pmin ternship.mca.gov.in ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. యువత సొంత రాష్ట్రంలో, ఇతర రాష్ట్రంలోనైనా 5ఇంటర్న్ షిప్‌లకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందని, భూపాలపల్లి జిల్లాకు 23 ఇంటర్న్ షిప్ కేటాయించినట్లు తెలిపారు. అభ్యర్థులు 21నుంచి 24మధ్య వయస్సు కలిగి ఉండాలని, 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారికి 13, డిప్లొమో చేసిన వారికి 2, ఐటీఐ చేసిన 8మందికి అవకాశం ఉందన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.5వేలు ఉపకార వేతనం అందజేస్తారని ఆయన పేర్కొన్నారు.

రామప్ప కాలువ బుంగ పూడ్చివేత

వెంకటాపూర్, మార్చి 12 : మండలంలోని పాలంపేటలోని రామప్ప సరస్సు ఒగరు కాలువకు పడిన బుంగను నీటిపారుదల శాఖ అధికారులు బుధవారం పూడ్చివేశారు. ఆదివారం రాత్రి కాలువకు బుంగపడి నీరు వృథాగా పోతుడండంతో సోమవారం నీటి సరఫరాను నిలిపివేశారు. అధికారులు మంగళ, బుధవారాల్లో ఇసుక బస్తాలతో బుంగను పూడ్చివేశారు. బుధవారం సాయంత్రం నీటిని విడుదల చేశామని డీఈ రవీందర్, ఏఈ జయంతి తెలిపారు.

విగ్రహాలు ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

చిట్యాల, మార్చి 12 : గిరిజనుల ఆరాధ్య దేవత శీతల భవాని దేవుళ్ల విగ్రహాలను ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు, రెవెన్యూ అధికారులకు సేవాలాల్ సేన మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం వినతి పత్రం అందజేశారు. మండలంలోని అందుకుతండా గ్రామ శివారులో గత 20యేళ్లుగా శీతల భవాని దేవుళ్లను పూజిస్తున్నామని, ఇప్పుడు గ్రామానికి చెందిన నర్రా అంజిరెడ్డి జేసీబీ సహాయంతో విగ్రహాల ఆనవాళ్లు లేకుండా తొలగించినట్లు చెప్పారు. అధికారులు చర్యలు తీసుకోవాలని సేవాలాల్ సేన మండల అధ్యక్షుడు బానోత్ రాజునాయక్ డిమాండ్ చేశారు. లావుడియా రాజునాయక్, అజ్మీరా రాజునాయక్, బానోత్ సమ్మయ్య, అజ్మీరా కల్యాణ్‌సింగ్, రవినాయక్, రామునాయక్, రఘుపతి, సమ్మయ్య పాల్గొన్నారు.

రెండో రోజుకు చేరిన ఎమ్మార్పీఎస్ దీక్షలు

మహదేవపూర్, మార్చి 12 : ఎస్సీ వర్గీకరణ తర్వాతే ప్రభ